క్లుప్తంగా

హైకోర్టు అడ్వకేట్‌గా కవలకుంట్ల పాపయ్య

పోరుమామిళ్ల: మండలంలోని కవలకుంట్లకు చెందిన కవలకుంట్ల పాపయ్య హైకోర్టు అడ్వకేట్‌గా నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం పాపయ్య మాట్లాడుతూ పేదప్రజలకు ఉచితంగా న్యాయం అందించాలనే ఆశయంతో అడ్వకేట్‌గా చేరానన్నారు.

దేవదాయశాఖ ఈఓగా రామలింగారెడ్డి



బద్వేలు అర్బన్: బద్వేలు దేవదాయశాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా ఎస్.రామలింగారెడ్డి నియమితులయ్యారు. సత్యసాయి జిల్లాలోని కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో బద్వేలు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు ఈవో పరిధిలోని 9 ఆలయాలను అభివృద్ధి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలి

ఖాజీపేట: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్ణయించుకుని దానిని సాధించేందుకు అడుగులు వేయాలని ఎంఈఓ స్వర్ణలత విద్యార్థులకు సూచించారు. పద్మావతి మహిళా మండలి అధ్యక్షురాలు చిన్న అమ్ములు అధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే సామగ్రిని ఎంఈఓ చేతులమీదుగా అప్పనపల్లె హైస్కూల్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. చదవాలనే లక్ష్యం ఉంటే ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ముందుకు వెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో పద్మావతి మహిళా మండలి సలహాదారులు జూలియర్ రాజు, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, రెహమాన్‌తోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమిత భూములను పేదలకు పంచండి

అట్లూరు: ఆక్రమిత ప్రభుత్వ భూములను పేదలకు అసైన్‌మెంటు కమిటీ ద్వారా పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రమణ, సీపీఎం నాయకులు చాంద్‌బాషా డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.


బ్రహ్మంగారిమఠం.. అభివృద్ధి పథం

- భారీగా నిధుల కేటాయింపు
- చాలా పనులు పూర్తి
- భక్తులకు సమకూరుతున్న సౌకర్యాలు

బ్రహ్మంగారిమఠం: శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన ప్రబోధకర్త, సంఘ సంస్కర్త, తత్వవేత్త, రాజయోగి, మహిమాన్వితుడిగా కీర్తి గడించారు. ఆయన సజీవ సమాధి నిష్ఠ పొందిన ప్రదేశం బ్రహ్మంగారిమఠం. కావున ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది ఉండాల్సింది. అయితే ఎన్నో కారణాల వల్ల ప్రగతిలో వెనుకబడి ఉంది. అయితే కొంత కాలం నుంచి అభివృద్ధి జాడ కనిపిస్తోంది. దర్శనీయ స్థలాల్లో కొంత మార్పు కనిపిస్తోంది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠంలో జరిగిన అభివృద్ధిపై అందిస్తున్న ప్రత్యేక కథనం.

రెండు కోట్ల పనులకు ప్రతిపాదనలు

మఠాధిపతి శివైక్యం చెందిన తరువాత తిరిగి మఠాధిపతి నియామకం జరిగే వరకు ఎండోమెంటు ఆధీనంలోకి మఠం పాలనా వ్యవహారం వెళ్లింది. ఏటా భక్తుల కానుకలు, మాన్యాల కౌలు, వ్యాపార సముదాయాల బాడుగలు, ఇతరత్రా కలుపుకొని ఏడాదికి దాదాపు రూ.10 కోట్ల ఆదాయం వస్తుంది. అందులో మఠంలో ఖర్చులు అలాగే ఉన్నాయి. అయినా మఠం పరిపాలనా అధికారి, ఈఓ శంకర్ బాలాజీ దేవస్థాన అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం మఠం నిధులు భారీగా కేటాయించారు. దేవస్థాన ఆవరణలో రూ 9.80 లక్షలతో ఇనుప రేకులషెడ్ నిర్మించారు. రూ 4.70 లక్షలతో టీటీడీ సత్రం దగ్గర ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టారు. పోలేరమ్మ గుడిని రూ. 42.50 లక్షలతో పూర్తి స్థాయిలో నిర్మించారు. కల్యాణ కట్ట నిర్మాణానికి రూ.24 లక్షలు, వీఐపీ అతిథి గృహ నిర్మాణానికి రూ.19 లక్షల వ్యయం చేశారు. మఠంలో భక్తులకు డార్మెంటరీ నిర్మాణానికి రూ 1.25 కోట్లు ఖర్చు చేశారు. రూ.20 లక్షలతో గోకులం నిర్మించారు. మఠం ఉత్తర భాగంలో రూ 7.60 లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టారు. మఠం ఆవరణలో ప్రత్యేక విద్యుత్ స్తంభాలు, ఎల్ఈడీ హైమాస్ లైట్లకు రూ. 44 లక్షలు వెచ్చించారు. ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణ పనులను రూ.10 లక్షలతో చేపట్టారు. పోలేరమ్మ గుడి దగ్గర వంట గదుల నిర్మాణానికి రూ.22.50 లక్షలు ఖర్చు చేశారు. పోలేరమ్మ గుడి దగ్గర రక్షణ గోడను రూ.88 లక్షలతో ఏర్పాటు చేశారు. పోలేరమ్మ గుడి దగ్గర వ్యాపార సముదాయాల కోసం రూ.30 లక్షలు వెచ్చించారు. టీటీడీ చౌల్ట్రీ దగ్గర స్టోన్ ఫ్లోరింగ్ నిర్మాణ పనులను రూ.89.59 లక్షలతో చేపట్టారు. ఇంకా రెండు కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపారు. తద్వారా భక్తులకు సౌకర్యాలు సమకూరనున్నాయి.



దేవస్థాన ప్రాకారం



గోశాల

త్వరలో మరిన్ని పనులు

బ్రహ్మంగారిమఠంలో గతంలో లేని విధంగా అభివృద్ధి చేస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యంగా రెండు రోజుల పాటు ఉండేందుకు ప్రత్యేక కాటేజీలు, పార్కులు, త్వరలో పనులు చేపట్టడం జరుగుతుంది. ఇందుకు మఠం నిర్వాకులు, కంది మల్లాయపల్లె పుర ప్రజలు, భక్తులు, సహకరించాలి. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతగానో ఉంది.

–సి.శంకర్ బాలాజీ, ఆలయ ఫిట్‌పర్సన్

యువ ఉత్సవ్‌లో ప్రతిభను నిరూపించుకోండి



యువ ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

మైదుకూరు: కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో జరిగే యువ ఉత్సవ్‌లో పాల్గొని యువతీయువకులు తమ ప్రతిభను నిరూపించుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, మైదుకూరు నెహ్రూ యువకేంద్రం అధికారి శివశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం కళాశాలలో వారు విద్యార్థులతో కలసి యువ ఉత్సవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీలో ఈనెల 16న జిల్లా యువ ఉత్సవ్ – 2047 పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇందులో పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా, వ్యక్తిగత పోటీలు, ఫోక్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయికి, అక్కడ గెలుపొందిన వారు జాతీయ స్థాయికి ఎంపిక అవుతారని పేర్కొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

తీరిన దమ్మనపల్లె ఎస్సీ కాలనీ నీటి కష్టాలు

కాలనీ వాసులకు నీటిని అందించిన ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని దమ్మన్నపల్లె ఎస్సీకాలనీ వాసుల నీటి కష్టాన్ని గమనించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారి సమస్య కేవలం 10 రోజుల్లో పరిష్కరించారు. ఇటీవల దమ్మన్నపల్లె వెళ్లిన ఎమ్మెల్సీకి స్థానికులు నీటికి పడుతున్న ఇబ్బందిని చెప్పారు. వెంటనే గోవిందరెడ్డి వైస్ ఎంపీపీ సీఎం బాషాతో మండల నిధులతో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కొండ పైనే పైపులు లాగి, 20 కుళాయిలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చేశారు. కేవలం పది రోజుల్లో పనులు పూర్తి చేసి కాలనీలో ఉన్న 200 కుటుంబాలకు ఇంటి వద్దే నీరు అందేలా పైప్ లైన్ వేశారు. సోమవారం ఎమ్మెల్సీ గోవిందరెడ్డి కుళాయిల ద్వారా నీటిని విడుదల చేసి, పథకానికి ప్రారంభం చేశారు. మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కల్లూరు రమణారెడ్డి, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు గురప్ప, ఇస్సాక్, వెంకటేశ్వర్లు, మహబూబ్‌పీర్, ఉపసర్పంచ్ నాగేంద్ర ప్రసాద్, రాళ్లపల్లె నరసింహులు పాల్గొన్నారు.



నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

స్నానాల ఘాట్ ఏర్పాటు అభినందనీయం

బద్వేలు అర్బన్ : సగిలేరు ఒడ్డున వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వంకెలపోలిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్నానాల ఘాట్‌ను సోమవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు. అనంతరం సగిలేరు ఒడ్డున ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షులు బంగారుశీనయ్య, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, బాలమునిరెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ జయరామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడిఫై పాఠశాల ద్వారా నాణ్యమైన విద్య

ప్రొద్దుటూరు కల్చరల్: ఉన్నత ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న ఎడిఫై పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొర్రపాడు రోడ్డులోని ఆదిత్యారామ్ కాంప్లెక్స్‌లో పాఠశాల కార్యాలయాన్ని ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎడిఫై పాఠశాల కరికులమ్ బాగుందని, అందువల్లనే ఆ పాఠశాలను ఈ ప్రాంత వాసుల కోసం ప్రొద్దుటూరులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎడిఫై పాఠశాల వ్యవస్థాపకుడు ఏకే అగర్వాల్, జీవన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, మదనపల్లి ఎడిఫై పాఠశాల కరస్పాండెంట్ రమేష్, వివిధ విద్యాసంస్థల కరస్పాండెంట్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



మౌలానా అబుల్ కలాం అవార్డులతో ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు: స్థానిక శ్రీ ఊటుకూరు వీరయ్య బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం రోజీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. డాక్టర్ సుజాత విద్యార్థులకు దంత పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాజుల శివజ్యోతి, కమాల్ బాషా, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్, ఎస్ఎంసీ చైర్మన్ ఆలీ బాషా, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక డీసీఎస్ఆర్ కాలనీలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మువ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీజే రాష్ట్రప్రధాన కార్యదర్శి సలీం, 10వ వార్డు మెంబర్ మహ్మద్ సాబీర్ , ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి తదితరులు పాల్గొన్నారు.

- మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సీఐ యుగంధర్ పేర్కొన్నారు.

స్థానిక మన ప్రజాసేవా సమితి కార్యాలయంలో జాతీయ విద్యా దిన్సోత్సవం సందర్భంగా మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంఈఓ సావిత్రమ్మ , మన ప్రజా సేవా సమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అబుల్ కలాం ఆజాద్ పురస్కారాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ సాధుగోపాలకృష్ణ, సమితి ఉపాధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖలీద్, ట్రెజరర్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యాలయంలో మౌలానా ఆజాద్ జయంతి

పోరుమామిళ్ల: స్థానిక ఏపీటీఎఫ్ రీజనల్ కార్యాలయంలో సోమవారం మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతిని పురస్కరించుకొని ఏపీటీఎఫ్ మండల ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఏపీటీఎఫ్ మండల నాయకులు సత్తార్, రామభూపాల్‌రెడ్డి, మాట్లాడుతూ అజాద్ విద్యాభివృద్ధికి చేసిన కృషి వివరించారు.

హర హర... మహాదేవ..



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరుడు



ప్రొద్దుటూరు కల్చరల్: అగస్త్యేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కాశినాయన: భక్తులను ఆకట్టుకుంటున్న 108 శివలింగాలు



ఖాజీపేట: నాగనాథీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: పరమశివునికి ప్రీతికరమైన కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాల వద్ద స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు ఆలయాలకు చేరుకుని మహాశివునికి అభిషేకాలు చేసి తమ మొక్కులు తీర్చుకుని, ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి పరమశివున్ని భక్తిశ్రద్ధలతో పూజించారు. స్థానిక అగస్త్యేశ్వరాలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరాలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి, ఆది శంకరాచార్యులు ప్రతిష్టించిన శ్రీచక్రానికి విశేష అభిషేకాలు చేసి అమ్మవారి మూలవిరాట్‌ను గంధంతో అలంకరించారు. హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెన్నానదీ తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగానికి, నవరత్నలింగానికి, జలలింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని కాశీ, కేదారీశ్వరుడులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించిన మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తుల నడుమ ఉత్సవమూర్తులను పల్లకీ సేవ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు అన్నసత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. కోలాట నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



చాపాడు: ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

అన్ని శివాలయాల్లో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం ఆలయ ముంగిళ్లలో భక్తులు వెలిగించిన కార్తీక దీపాల వెలుగులో నూతన శోభను సంతరించుకున్నాయి.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

చాపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లెలో కార్తీక సోమవారం పురస్కరించుకొని శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు జరిపారు. సోమవారం తెల్లవారుజామునే ఆలయంలో వీరభద్రస్వామి, భద్రకాళీ, కేదారీశ్వరుడులకు...



బద్వేలు అర్బన్: రూపరాంపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కాశినాయన: ప్రత్యేక అలంకరణలో అక్కంపేట విభూది శివలింగం



చాపాడు: అల్లాడుపల్లె భక్తుల మధ్య కోలాట నృత్యాలు

మార్మోగిన శివనామస్మరణ

బద్వేలు అర్బన్: కార్తిక సోమవారం సందర్భంగా పట్టణంలోని పలు శివాలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. భక్తులు తెల్లవారుజాము నుండే ఆలయాలకు చేరుకుని కార్తిక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. స్థానిక రూపరాంపేట శివానందస్వామి ఆలయంలో నిర్వహించిన లక్షబిల్వార్చన, సహస్రదీపాలంకరణ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అలాగే శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి శివాలయంలోని స్ఫటిక శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తెలుగు గంగ కాలనీలోని ఓంకారేశ్వరస్వామి ఆలయం, చెన్నంపల్లె సమీపంలోని భవానీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, అనంతగిరి మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, వీరభద్రస్వామి ఆలయం, నాగులకట్ట మీద శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మారుమోగిన శివనామస్మరణ

బి.కోడూరు: కార్తిక మాసం రెండవ సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మండలంలోని పందివీడులోని శివాలయం, మున్నెల్లి గ్రామ సమీపాన గల చెన్నకేశవస్వామి ఆలయం, ఎం.నరసింహ్మపురం గ్రామానికి తూర్పు దిశన కొండలో గల దప్పిళేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా మేకవారిపల్లె గ్రామ సమీపంలోని అఖిలాండేశ్వరి బ్రహ్మనంద ఆశ్రమంలో గల 108 శివలింగాలను దర్శించుకునేందుకు మండలం నుండే కాకుండా చుట్టుపక్కల మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని 108 శివలింగాలతో పాటు సాయిబాబా, దత్తాత్రేయ, సత్యనారాయణస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి, నందీశ్వరులకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు

కాశినాయన: మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు నిర్వహించారు. శివాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు చేసి దీపాలను వెలిగించారు. కత్తెరగండ్ల, జ్యోతి శివాలయాల్లో అన్నదానం చేశారు. అక్కంపేట విభూది శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఇక్కడ విభూది శివలింగాన్ని కాలజ్ఞానకర్త బ్రహ్మంగారు ప్రతిష్ఠించారు.

'విద్యార్థులు కంటి అద్దాలు తప్పక వాడాలి'

చాపాడు: కంటి సమస్యలతో దృష్టి లోపం ఉన్న విద్యార్థులు తప్పనిసరిగా కంటి అద్దాలు ఉపయోగించాలని నేత్ర వైద్యాధికారి కేజే రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో 249 మంది విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 31 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వనున్నట్లు నేత్ర వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఉపాధ్యాయులు సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యులు తేజ, కస్తూర్బా స్పెషలాఫీసర్ నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శృతి, కస్తూర్బా ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు పెర్సీ, వెంకటసుబ్బమ్మ, కస్తూర్బా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక డబ్బు వసూల్ చేస్తే చర్యలు

ఖాజీపేట: ఆధార్ కేంద్రాల్లో ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు మించి డబ్బులు వసూల్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్ పర్థి హెచ్చరించారు. ఆధార్ కేంద్రాల మీద వస్తున్న విమర్శలతో సోమవారం ఆయన ఖాజీపేటలోని ఆధార్ కేంద్రాలను పరిశీలించారు. ఖాజీపేట సచివాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రాంను పరిశీలించారు. ప్రతి పనికి ప్రభుత్వం సూచించిన డబ్బులు మాత్రమే వసూల్ చేయాలని సూచించారు. అనంతరం ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అర్జీల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ప్రజలకు అందరూ అందుబాటులో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఆర్ఐ రవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఈనెల 14న కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ప్రజా పోరు మహాధర్నా పోస్టర్లను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు శ్రీను, చెన్నారెడ్డి, సీఐటీయూ కార్యదర్శి విజయకుమార్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం

మైదుకూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన కూరగాయలతో ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు అన్నారు. సోమవారం మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి తోటలు, ఆకు తోటలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ పెరటి తోటలో కూరగాయలను పురుగు మందులు వినియోగించకుండా సాగు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు పీఎండీఎస్ కిట్స్‌ను అందించాలని సూచించారు. కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ అరటి తోటలు, పెరటి తోటల పెంపకంలో పురుగు మందులు వినియోగించకుండా, వేప కషాయాలను వాడాలని సూచించారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలను, బ్యాటరీ స్ప్రేయర్లను, టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు.

విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

బద్వేలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 9.8 శాతం మాత్రమే నిధులు కేటాయించిందని, ఇది గత బడ్జెట్‌లతో పోల్చితే చాలా తక్కువగా ఉన్నాయని, ఈ నిధులు ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడవని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదనవిజయకుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించడం తీవ్ర నిరాశపరిచిందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి 30 శాతం నిధులు తమ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాలని చెప్పిన కొఠారి కమిషన్ సిఫార్సుల దరిదాపుల్లో కూడా ఈ బడ్జెట్ కేటాయింపులు రాకపోవడం శోచనీయమన్నారు. 12వ పీఆర్సీకి సంబంధించిన అంశాలు గాని ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.